క్లుప్తంగా

మే పుష్పం కనువిందు



పొదలకూరు : పట్టణంలోని నర్సారెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న మాల్యాద్రి, మంజుల దంపతుల నివాసంలో మే పుష్పం కనువిందు చేసింది. ఏడాదిలో ఒక్కసారి మేలో మాత్రమే పూసే ఈ పుష్పం పదిహేను రోజుల ముందుగానే వికసించింది, ఎర్రటి వర్ణంతో బంతి ఆకారంతో మే పుష్పం చూపరులను ఆకర్షిస్తోంది.

వృద్ధుడి అదృశ్యం



ఇందుకూరుపేట: మైపాడు గ్రామానికి చెందిన పెళ్లూరు రమణయ్య అనే 74 ఏళ్ల వృద్ధుడి అదృశ్యంపై కుటుంబ సభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 4న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత గాలించిన ఆచూకీ తెలియలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై వెంకటరాజేష్ తెలిపారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు 94407 96321 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

యర్రంరెడ్డికి సన్మానం



బుచ్చిరెడ్డిపాళెం: వవ్వేరు కోఆపరేటివ్ బ్యాంకు నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన యర్రంరెడ్డి స్వర్ణ భర్త వైఎస్సార్‌సీపీ నేత యర్రం రెడ్డి గోవర్ధన్‌రెడ్డిని ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. రేబాలలోని నివాసంలో గోవర్ధన్‌రెడ్డిని కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అలాగే గోవర్ధన్‌రెడ్డిని బుచ్చిరెడ్డిపాళెం ఇరిగేషన్ డీఈ మధు, ఏఈ వినయ్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, నాయకులు రాఘవరెడ్డి, మస్తానయ్య, మల్లికార్జున్ పాల్గొన్నారు.

పులికల్లులో కేంద్ర బృందం పర్యటన



పొదలకూరు : మండలంలోని పులికల్లు పంచాయతీలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కేంద్ర బృందం శనివారం పర్యటించింది. కేంద్రం బృందం సభ్యుడు మహేష్ మరుగుదొడ్ల నిర్మాణం, పంచాయతీ భవనం, అంగన్‌వాడీ కేంద్రం, పారిశుధ్యం, నేమ్‌బోర్డు, తదితర అంశాలను పరిశీలించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, ఎస్టీ కాలనీలోని గృహ నిర్మాణాలు, రోడ్లు, తాగునీరు, వీధి దీపాలను నూరుశాతం ఏర్పాటు చేయడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట సర్పంచ్ జీవీ సుబ్బమ్మ, కార్యదర్శి మాధవి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అరుణ, గ్రామపెద్ద జీ నారాయణరెడ్డి, గ్రీన్‌అంబాసిడర్లు ఉన్నారు.

చికెన్ వ్యర్థాల పూడ్చివేత



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రేబాలలో పట్టుకున్న 44 డ్రమ్ముల చికెన్ వ్యర్థాలను మత్స్యశాఖ అధికారులు, పోలీసులు శనివారం పూడ్చివేశారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ ఏడీ ప్రసాద్ మాట్లాడుతూ రేబాల విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక వైపునున్న రొయ్యల గుంతల్లో మేతగా వేసేందుకు లారీ, వ్యాన్‌లో తీసుకొచ్చిన చికెన్ వ్యర్థాలను శుక్రవారం పట్టుకున్నట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి చికెన్ వ్యర్థాలను దామరమడుగు వద్ద పెన్నానది ఒడ్డున జేసీబీ సాయంతో గుంత తీసి అందులో పూడ్చివేశామన్నారు. ఎఫ్‌డీఓ పొట్టయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సన్మార్గంలో నడుచుకోవాలి



కోవూరు: సమాజంలోని ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో సన్మార్గంలో నడుచుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. లేగుంటపాడులోని శ్రీకృష్ణ అఖండానంద ఆశ్రమంలో భగవాన్ శ్రీరమణ మహర్షుల ఆరాధన మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ భగవాన్ రమణ మహర్షి గొప్ప తపస్వి, మహావైరాగ్య సంపన్నులని, దేహాభిమానం లేని దేదీప్యమానులని పేర్కొన్నారు. ఆయన భౌతికంగా మనమధ్యన లేకపోయినా ఆయన బోధనలు భక్తులను ఉద్ధరిస్తున్నాయన్నారు. రమణ మహర్షి భక్త బృందం శ్రీకృష్ణానంద స్వామి, చీమకుర్తి వెంకటేశ్వరరావు, తరిమద్దెల నరసింహారెడ్డి, జయకృష్ణ, ఉరురాయ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



వృద్ధురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



వెంకయ్యస్వామిని దర్శించుకునేందుకు వస్తున్న మంత్రి కాకాణి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గొలగమూడిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం మంత్రి కాకాణి నిర్వహించారు. తొలుత భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రికి ఆశ్రమ ఈఓ బాలసుబ్రహ్మణ్యం ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. సీసీరోడ్లు, డ్రెయిన్లు, నాడు-నేడు పథకం కింద ఆశ్రమ గిరిజన పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. దేశ చరిత్రలోనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నూటికి నూరుశాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ప్రజలను అన్ని విధాలా మోసం చేయగా, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని వాటిని నెరవేర్చి ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నారని కొనియాడారు. అనికేపల్లి పంచాయతీ పరిధిలోని గొలగమూడి, అనికేపల్లి గ్రామాల్లో తాము అధికారంలోకి వచ్చిన తరువాత రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు.

ప్రజల మధ్య తిరిగే దమ్ము టీడీపీకి ఉందా?

ప్రజల మధ్యన తిరిగే దమ్ము టీడీపీ నాయకులకు ఉందాని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమలను వివరించేందుకు తాము గ్రామాల్లో ప్రజల మధ్యన తిరుగుతున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో తాము చాలా సంతోషంగా ఉన్నామని ప్రజలు బ్రహ్మరథం పడుతూ చెబుతున్నారని పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఏం మేలు చేశారని ఆ పార్టీ నాయకులు ప్రజల మధ్యన తిరగగలరాని ప్రశ్నించారు. రైతులు, పొదుపు మహిళలకు రుణమాఫీ చేస్తామని నమ్మించి మోసం చేయడంతో గత ఎన్నికల్లో టీడీపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని గుర్తుచేశారు. టీడీపీ ఫొటో షూట్ కార్యక్రమాలను చేపడుతోందని విమర్శించారు. ప్రజలతో మాట్లాడే ధైర్యం లేక కేవలం రెండు ఫొటోలు తీసుకుని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, నంబూరు రాజానాయుడు, వైస్‌ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారప్రతినిధి మందల వెంకటశేషయ్య, సర్పంచ్ కొమరగిరి శీనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనపై ప్రజలు సంతృప్తి



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, ప్రతి ఇంటా జగనన్నే మా భవిష్యత్తు అని స్పష్టం చేస్తున్నారని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కొడవలూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం ఆయన నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 63,838 గృహాలను సందర్శించినట్లు తెలిపారు. గడప గడపకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి జగన్ పాలన రాష్ట్రానికి అవసరమని, మళ్లీ ఆయనే సీఎం కావాలని ప్రతి ఇంట్లో ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు.

వైఎస్సార్ ఆసరా నమూన చెక్కు అందజేత

మండలంలోని పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత కింద విడుదల చేసిన రూ.6.83 కోట్ల నమూనా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పొదుపు మహిళలు పాలాభిషేకం చేశారు. అనంతరం మహిళలకు ఎమ్మెల్యే తన సొంత నిధులతో చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ఏకైక ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్ అని అన్నారు. ఎన్నికలకు ముందుకు ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ ఆసరా పథకం కింద పొదుపు మహిళల రుణ బకాయిలను చెల్లిస్తున్నారని గుర్తుచేశారు. కొడవలూరు మండలంలో మూడు విడతల్లో రూ.21 కోట్లను అక్కచెల్లెమ్మలకు అందించినట్లు తెలిపారు. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ జీ వసంతకుమారి, ఏపీఎం ఎస్ రుక్మిణి, ఎంపీపీ జీ జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, నాయకులు ఒట్టూరు సునీతమ్మ, నక్కా తిరుపతమ్మ, పొబ్బా రవి, కే నాగేశ్వరరావు, ఎస్ నాగేశ్వరరావు, పీ మురళి, ఎస్ చిన్నా, ఎంపీటీసీ ప్రతాప్, సర్పంచ్ కామాక్షి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా మరుగుదొడ్లు ప్రారంభం



ప్రజామరుగుదొడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: నార్తురాజుపాళెంలోని ప్రధాన కూడలిలో రూ.15 లక్షలతో నిర్మించిన ప్రజామరుగుదొడ్లను ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్తురాజుపాళెం కూడలి ప్రాంతం కావడంతో నిత్యం ప్రయాణికుల రద్దీ ఉంటుందన్నారు. ఇక్కడ ఎన్నో ఏళ్లుగా మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడంతో ప్రధానంగా మహిళలు అసౌకర్యానికి గురయ్యేవారన్నారు. ఆధునిక హంగులతో మరుగుదొడ్లు నిర్మించి ఆ సమస్యను పరిష్కరించామన్నారు. తొలుత కొడవలూరులోని మీనమ్మగుంటలో రూ.12.50 లక్షలతో నిర్మించిన డ్రెయిన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.

చిన్నారులకు ఆర్థిక సాయం

మీనమ్మగుంటలో తల్లిదండ్రులను కోల్పోయిన యాటగిరి పల్లవి, జాన్‌బాబుకు ఎమ్మెల్యే ప్రసన్న ఆర్థిక సాయం అందజేశారు. నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఒక్కొక్కరికి రూ.20 వేల వంతున రూ.40 వేలు బ్యాంకులో డిపాజిట్ చేసి పత్రాలను అందజేశారు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం, ఎంపీపీ జీ జ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఏఈలు ఎం లీలాప్రకాష్, ఏ రమేష్, సర్పంచ్‌లు బీ సుప్రియ, ఎస్ కామాక్షి, నాయకులు కే శ్రీనివాసులురెడ్డి, ఎస్ మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం



అవగాహన కల్పిస్తున్న సెబ్ సీఐ బాలకృష్ణ

ముత్తుకూరు: మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనమవుతాయని సెబ్ సీఐ బాలకృష్ణ హెచ్చరించారు. మండలంలోని ఈపూరు వెంకనపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. చెడు స్నేహాలతో మత్తు పదార్థాలకు అలవాటు పడి, వాటికి బానిసలుగా మారి ప్రాణాలకు ముప్పు తెచ్చుకోవద్దని సూచించారు. విద్యార్థినులు గుడ్ టచ్..బ్యాడ్ టచ్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశం



ఇందుకూరుపేట: పల్లిపాడులోని పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. తొలుత ఆశ్రమం ఆవరణలోని మహాత్మగాంధీ విగ్రహం, స్థల దాత పొణకా కనకమ్మ విగ్రహాలకు సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ కే సుధాకర్‌రెడ్డి, విశ్రాంత డీఈఓ జీ నరసింహారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ అంశాలపై విశ్రాంత ఉపాధ్యాయులు చర్చించారు. డైట్ కళాశాల ప్రిన్సిపల్ రమేష్, సర్పంచ్ సుధాకర్, కోర్ కమిటీ సభ్యులు మంజుల, ఆశ్రమ కమిటీ సభ్యులు అల్లాబక్ష పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఎత్తు పెంపు

ఇందుకూరుపేట: కొమరిక పంచాయతీ పరిధిలోని గంగపట్నం రోడ్డులోని 11కేవీ విద్యుత్ లైన్ స్తంభాల ఎత్తును శనివారం పెంచారు. విద్యుత్ స్తంభాల ఎత్తు తక్కువగా ఉండడంతో వాహనాల రాకపోకల సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు విద్యుత్‌శాఖ అధికారులకు విన్నవించారు. ఈ నేపథ్యంలో విద్యుత్‌శాఖ ఏఈ నరసింహులు పర్యవేక్షణలో మూడు స్తంభాల ఎత్తు పెంచారు.



నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణోత్సవం



విశేషాలంకారంలో లక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి

పొదలకూరు : శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణానక్షత్రం సందర్భంగా పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి కల్యాణోత్సవాన్ని శనివారం నేత్రపర్వంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా సుబ్బారెడ్డి, సుమత నూజా దంపతులు వ్యవహరించారు. ఆలయ కమిటీ సభ్యులు వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎం శ్యాంప్రసాద్, కొమ్మి వేణుగోపాల్, చొప్పా వెంకటేశ్వర్లు, దాసరి శ్రీనివాసులు, సన్నికంటి మురళి పాల్గొన్నారు.

- అయ్యప్పనగర్‌లోని శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలోనూ శ్రీవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా ధనుంజయ,లాస్య దంపతులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ బీ మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

ముమ్మరంగా జగనన్నే మా భవిష్యత్తు



పోతిరెడ్డిపాళెంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కోవూరు: మండలంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని శనివారం ముమ్మరంగా నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. పోతిరెడ్డిపాళెంలో సర్పంచ్ నలుబోలు శ్రీవాణి, గంగవరంలో సర్పంచ్ యోడెం లక్ష్మీకుమారి, జేసీఎస్ కన్వీనర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి

పొదలకూరు : పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన తోడేరు ఎస్టీకాలనీకు చెందిన అంకయ్య(35) నెల్లూరులోని జీజీహెచ్‌సీలో చికిత్సపొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్సై ఎస్కే కరీముల్లా వివరాల మేరకు.. తోడేరు ఎస్టీకాలనీకి చెందిన అంకయ్య(35), కోటమ్మ దంపతులు. వీరికి ఇద్దరు సంతానం. భార్యపై అనుమానం పెంచుకున్న అంకయ్య శుక్రవారం ఆమెతో గొడవపడ్డాడు. అనంతరం బిరదవోలుకు వెళ్లి అక్కడి నిమ్మతోటలో పురుగు ముందు తాగాడు. తోట కాపలాదారులు గుర్తించి పొదలకూరు సీహెచ్‌సీకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ



మనుబోలు: సేవానాథం ట్రస్ట్ ఆధ్వర్యంలో మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని శనివారం ఏర్పాటు చేశారు. సేవానాథం ట్రస్ట్ వ్యవస్థాపకుడు మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి సూచనలతో విద్యార్థులకు వేసవి తాపం నుంచి ఉపశమనం కల్పించేందుకు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. ఇకపై వారానికోరోజు మనుబోలులోని రద్దీ కూడళ్లలో మజ్జిగ, మంచి నీటి చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. సేవానాథం ట్రస్ట్ సభ్యులు మహిధర్‌రెడ్డి, భార్గవ్, గిరి, ప్రేమ్‌కుమార్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమల్లో అలసత్వం వద్దు



మాట్లాడుతున్న ఎంపీపీ స్వర్ణలత

తోటపల్లిగూడూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలకందించే విషయంలో అలసత్వం వహించొద్దని ఎంపీపీ ఉప్పల స్వర్ణలత అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందన్నారు. ప్రభుత్వ పథకాలు పేదలకు చేర్చాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలన్నారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ హేమలత, జెడ్పీటీసీ ఎంబేటి శేషమ్మ, వైస్‌ఎంపీపీలు చెరుకూరు శ్రీనివాసులనాయుడు, కంజి నీలమ్మ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీహరి

కోవూరు: మండలంలోని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీహరి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై ఇంజినీరింగ్ సహాయకులతో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం బిల్లులను ఎప్పటికప్పుడు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోందని తెలిపారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ పద్మజ హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



పొదలకూరు : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పొదలకూరు అగ్నిమాపక అధికారి వరకుమార్ ఆధ్వర్యంలో సినిమాహాల్ వద్ద అగ్నిప్రమాదాలపై శనివారం అవగాహన కల్పించారు. సినిమాహాళ్లలో చోటు చేసుకునే అగ్ని ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. వంట గ్యాస్‌తో జరిగే ప్రమాదాలు, నివారణపైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో సత్ఫలితాలు



టీపీగూడూరు: మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

కోవూరు(విడవలూరు): భూసార పరీక్షలకు అనుగుణంగా రైతులు పంటలను సాగుచేయడం ద్వారా సత్ఫలితాలను పొందవచ్చని ఆత్మ డీడీ జీ శివన్నారాయణ పేర్కొన్నారు. విడవలూరు మండలం రామతీర్థంలో భూసార పరీక్షలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటల సాగుకు ముందుగా భూసార పరీక్షలను తప్పనసరిగా చేయించుకోవాలని సూచించారు. భూసార పరీక్షల ఫలితాలకు అనుగుణంగా ఎరువులను వినియోగించడం ద్వారా పెట్టుబడులు తగ్గించుకోవచ్చని తెలిపారు. అనంతరం వేరుశనగ పంటను పరిశీలించారు. కేవీకే శాస్త్రవేత్త విజయకుమార్, ఏఓ శైలజకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: భూసార పరీక్షలకు మట్టి నమూనాల సేకరణపై గ్రామ వ్యవసాయ,ఉద్యాన సహాయకులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఏఓ రఘునాథ్‌రెడ్డి అన్నారు. కొత్తూరులో మట్టి నమూనాల సేకరణపై శనివారం అవగాహన కలిపంచారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మట్టి నమూనాలు ఎలా తీయాలి, దాన్ని ల్యాబ్‌కు ఎలా పంపించాలనే అంశాలపై అవగాహన కల్పించారు.

తోటపల్లిగూడూరు: వరి సాగులో భూసార పరీక్షలతో సత్ఫలితాలను సాధించవచ్చని ఇందుకూరుపేట ఏడీ రాజ్‌కుమార్ తెలిపారు. తోటపల్లిగూడూరు వ్యవసాయశాఖ సిబ్బందికి మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్ష ఫలితాలపై శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఆమ్ల, క్షార భూములను గుర్తించవచ్చన్నారు. అందుకనుగుణంగా ఎరువులను వినియోగించడం ద్వారా పెట్టుబడులను తగ్గించుకోవచ్చన్నారు. అనంతరం నరుకూరు ఆర్‌బీకే పరిధిలోని పంటపొలాల్లో మట్టి నమూనాలను సేకరించారు. ఏఓ గీతాకుమారి, వీఏఏలు పాల్గొన్నారు.

నేల స్వభావం ముఖ్యం

ముత్తుకూరు: మండలంలో వరి, వేరుశనగ సాగు చేసే రైతులు నేల స్వభావాన్ని తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ అన్నారు. బ్రహ్మదేవి ఆర్‌బీకే పరిధిలోని ఈదులవారిపాళెం పంటపొలాల్లో మట్టి నమూనాల సేకరణపై రైతులకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు మట్టి నమూనాల సేకరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఐదు ఎకరాలను ఒక యూనిట్‌గా తీసుకొని, పది చోట్ల గుంతలు తీసి మట్టి నమూనాలు సేకరిస్తున్నామన్నారు. వాటి ఫలితాల ఆధారంగా ఎటువంటి పంటలు వేయాలని రైతులకు సూచనలు చేస్తామన్నారు. ఏఓ జోత్స్నారాణి, వీఏఏలు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట అవగాహన కల్పిస్తున్న ఏఓ



రామతీర్థంలో అవగాహన కల్పిస్తున్న ఆత్మ డీడీ

పొట్టేళ్ల కాలువ కబ్జాపై పరిశీలన

పొదలకూరు : పట్టణానికి సమీపంలో జలవనరుల శాఖ ఆధీనంలోని పొట్టేళ్ల కాలువ కబ్జాకు గురైనట్లుగా ఫిర్యాదులు అందడంతో ఏఈ అనిల్‌కుమార్ శనివారం పరిశీలించారు. కాలువకు తూర్పు వైపున కొందరు లేఅవుట్ నిర్మించి కాలువ పొరంబోకును కబ్జా చేశారని ఏఈకు ఫిర్యాదు చేయడంతో వెళ్లి పరిశీలించారు. అనంతరం తహసీల్దార్‌కు ఏఈ రాతపూర్వకంగా సమాచారం అందజేసి సర్వేయర్‌ను పంపి కొలతలు వేయించాల్సిందిగా కోరారు. కాలువ పొరంబోకు భూమి కబ్జాకు గురైతే వెంటనే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.